



బ్రహ్మాండం బద్దలయింది



# బ్రహ్మాండం బద్దలైంది  వేమూరి వెంకటేశ్వర రావు

కోటు కొక్కేనికి తగిలించి, ఆఫీసు తలుపుకి లోపల గెడ పెట్టి, కాళ్ళు రెండూ బల్ల మీదకి బారజాపి కుర్చీలో కూల బడ్డారు మిడతంభొట్లు. అక్కడక్కడ పల్చబడుతూ వున్న జుత్తు గుండా చేతి వేళ్ళు పోనిచ్చి, ఎదురుగుండా ఉన్న గాజద్దాల కిటికీలోంచి శూన్యంలోకి చూస్తూ కూర్చున్నా రాయన. గదిలో ఎయిర్ కండిషనింగ్ ఉన్నప్పటికీ ఎప్పుడూ నిశ్చలంగా ఉండే ఆయన విశాలమయిన నుదిటి మీది మర్మ బిందువులు ఆయన మనస్సులో చెలరేగుతూవున్న తుఫానుకి ప్రత్యక్షతార్కాణంగా నిలిచేయి. అప్పుడే ఇంటి వద్ద తాగి వచ్చినా, ఫ్లాస్కు లో కాఫీ కప్పు నిండా పోసుకుని మళ్ళా తాగారు. కుర్చీలోంచి లేచి, ఆఫీసులోనే బోనులో పులి లా తిరిగారు. తక్షణ కర్తవ్యం ఏమిటో తేల్చుకోలేక దిగాలుగా మళ్ళా కుర్చీలో కూల బడ్డారు.

ఆ రోజు ఆఫీసుకి బయల్దేరే సమయం అది. అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు తను. కాఫీ కుంపటి దగ్గర ముక్కాలి పీట మీద కూర్చు ని రాధ తో కబుర్లు చెబుతూ.

– – గుంట వెధవ ఊరు కున్నాడా ! ఏటం బాంబులా వదిలాడు. మరొకడూ మరొకడూ అయితే ఏదో యీ రోజుల్లో కుర్రకారు కూసే అర్థంలేని వూత పదాల్లో ఇదొకటనుకునేవాడు. కానీ మిడతంభొట్లు గారు ఏదో సామాన్యమైన వుల్ఫాగాడయితే ప్రభుత్వం వారు ప్రత్యేకంగా ఆహ్వానించి రక్షణ శాఖ లోని శాస్త్ర వేత్తల సిబ్బందికి నాయకుడుగా ఈయనని నియమించి వుండేవారే కాదు. ఆంధ్రా యూనివర్సిటీలో అలా రాటవుతూ ఉండేవారు. దైనందిన జీవితంలో ఏదో సామాన్యమైనదని అందరూ నిర్లక్ష్యం చేసే చిన్న చిన్న సంఘటనల లో అసామాన్యత కనిపిస్తుంది మిడతంభొట్లు గారికి. ఈ సమర్థతని దొరతనం వారు వాడుకోదలిచేరు.

ఈ విశ్వానికి అయిదవ కొలత ఉన్నాదని ప్రతిపాదించి దానిని సమర్థిస్తూ ఆ మధ్య కొన్ని వ్యాసాలు రాశారు మిడతంభొట్లు అవ్యక్తంగా. ఆంధ్రా యూనివర్సిటీ లో బ్రిడ్జి ఆడకుండా మూల పడి ఉన్నా ఈయన రచనలు సముద్రాలు దాటి ఆవలి కెళ్ళాయి. సమర్థులు, శ్వేతవర్ణులు అయిన శా స్త్ర వేత్తలు కొందరు ''ఔరా'' అన్నారుట. అని ఊరుకున్నారా? ''మిడతంభొట్లు గారి సిద్ధాంతాలు చదివి అర్థం చేసు కోడానికి పంచేంద్రియాలూ చాలవు. దివ్యదృష్టి వుండాలి '' అని రాశాట్ట ఒక దొర. వ్రాశి ఊరుకున్నాడా ? ``A sixth

sense is required to appreciate the fifth dimension`` అని చమత్కరించాడుట. ''మీ తెలుగు ఇటాలియన్ లా ఉందిస్మీ'' అని ఒక దొర గారు అబ్బుర పడే సరికె అది పొగడ్తా, గిగడ్తా అని కూడా ఆలోచించుకోకుండా తుళ్ళిపడి ఆనందించిన తెలుగు వాడిలా అదిరి పడింది నయా దిల్లీ---- మిడతంభొట్లు గారి మీద దొర గారు రాసిన వ్యాఖ్య చూసి. అదిరి పడి పదవి నొకదానిని యిచ్చింది.

పులి కడుపున పిల్లి పుడుతుందా ? మిడతంభొట్లు గారి వంశోద్ధారకుడుపసితనంలోనే పరిమళించ సాగేడు. ''ఏమండీ దివ్యదృష్టి గారూ'' అని తనని ఎవరయినా సంబోధిస్తే తేలికగా నవ్వి పారేసే మనిషి తన కుమార రత్నానికి ఆ శక్తి ఉందేమోనని అప్పుడప్పుడు అనుమానించక పోలేదు. ప్రతి తండ్రి తన కొడుకుకి నొబెల్ బహుమానం రావాలని కోరు కోవడంలో తప్పు లేదు. తను సాధించలేని కార్యాలన్ని తన పుత్రుడన్నా సాధించాలని ఆశించడంలోనూ వింత లేదు. మిడతంభొట్లు ఇటువంటి మానవ దౌర్బల్యానికి అతీతుడుకారు. కాని చిరంజీవికి దివ్యదృష్టి ఉందేమోనని అనుమాన పడడానికి పుత్రవాత్సల్యానికి అతీతమైనవి బలమైనవి ఎన్నో ఆధారాలున్నాయి మిడతంభొట్లు గారికి ఏడాది క్రితం సంగతి. ప్రభుత్వపు పని మీద తను గ్రామాంతరం వెడుతూ ఉంటే ''వర్షం పడుతుంది రెయిన్ కోటు, గొడుగూ పట్టుకెళ్లండి నాన్నా'' అన్నాడు వాడు. వెళ్ళేది ఎడారి లోకి. అక్కడ దశాబ్దానికి ఒక జల్లు పడితే అది పత్రికలలో పతాక శీర్షిక నధిష్టించే వార్త. అటువంటి ఎడారిలో కుండపోతగా వర్షం కురిసిందానాడు. ఇటువంటి చిన్నచిన్న సంఘటనలెన్నో జరిగాయి. మిడతంభొట్లు గారి తార్కిక బుద్ధికి ఇలా చెదుముదురుగా జరిగిన సంఘటనలలో రాను రాను ఒక బాణీ కనిపించ సాగింది. అనుమానం పుట్టింది. పెనుభూతమై కూచుంది. ఆయన మస్తిష్కంలో కుమ్మరి పురుగులా గొలగడం మొదలు పెట్టింది.

చంద్రుడు గుడి కట్టినా, కీచురాయి కూత కూసినా, సముద్రం హోరు పెట్టినా వర్షంపడుతుందని మామ్మ జోశ్యం చెప్పేది. ఆకాశవాణి వారు చెప్పినప్పుడల్లా భరోసా ఏమీ లేదు కానీ మామ్మ చెబితే వరుణదేవుడు టెంకలు కొట్టుకుంటూ వచ్చేవాడు. అంత మాత్రం చేత మామ్మ కి దివ్యదృష్టి ఉందని తను ఎప్పుడూ అన లేదే. చిరంజీవి పద్ధతికీ మామ్మ పద్ధతికీ చాలా తేడాలున్నాయి. మామ్మ గారిని అడగని వాళ్ళది పాపం. అడిగిన వాళ్ళందరికీ కుల మత భేదాలు లేకుండా, తన జోస్యాన్ని ఉచితంగా పంచిపెట్టేది. ఉత్త జోస్యం చాలా మంది చెబుతారు. భవిష్యత్తుని తెలుసుకున్న తరవాత, భవిష్యత్తు కళ్ళముందు విడుతూ ఉంటే, నాటకాన్ని చూసిన ప్రేక్షకుల్లా స్థబ్దుగా కూర్చోవడం ఆవిడకి ఇష్టం లేదు. వర్షం పడదని తెలిస్తే వెంటనే అవధాని గారికి కబురంపి, ఈశ్వరుడికి సహస్ర పట్టాభిషేకం చేయించేది. వేసవి కాలంలో చెట్లన్నీ సిపాయల్లా నిలబడి ఉంటే, గుమాయింపు తగ్గడానికని `దూ గాలీ, దుప్పన్న గాలీ, పాటి మీద గాలీ, పార్రా గాలీ` అని బుజ్జగించేది. టూకీగా చెప్పాలంటే భవిష్యత్తుని

లోక కళ్యాణార్ధం మరమ్మత్తు చెయ్యడానికి వెనక తీసేది కాదు ఆమె. ఈ అంశే నాన్న గారి లోనూ ఉండేది. ఆయన జాతకాలు మరమ్మత్తు చేశేవారు. ఆయనలో ఉన్న ప్రత్యేకత జాతకతలనీ హోమియోపతి వైద్యాన్ని అనుకూలమైన పాళ్ళలో మేళ వించడం. లేకపోతే బంగారం ముట్టుకుంటే మట్టి అవుతూ ఉన్న ఒక దైవోప హతుడి జాతకంలో శని మహాదశని మరమ్మత్తు చేసి, జాతకుడిని అమెరికా ఎలా పంపగలరాయన. చాలా మంది దీన్ని అని విశదీక రించారు. మరి కొంత మంది 'సైకలాజికల్ ట్రీట్‌మెంట్' అన్నారు. ఏది ఏమైనా ఇదేదో వంశ పారంపర్యంగా వస్తున్న అంశ లా ఉంది గానీ....

''పోలికలు ఎక్కడికి పోతాయి'' అని మిడతంభొట్లు గారు చాల రోజులు సమర్ధించి ఊరుకున్నారు. కానీ కుర్రాడి బాణీ కొట్టొచ్చినట్టు కనిపిస్తూ ఉంటే...'' ఒరే నాన్నా, సెన్ డౌన్ ఎంత లేటవుతుందిరా అని అడగండి. రయిల్వే వారికెంత తెలుసో వీడికీ అంతే తెలిసేది. బిక్క మొహం మాత్రం జవాబు గా మిగిలేది. లేకపోతే ఏ మహాలక్ష్మి లోనో, గుర్రాల మీద కాసి ఈ పాటికి బంగారపు ఇటికలతో.... ఎప్పుడో మూడుముక్కలు చెబుతాడు. అది భవిష్యత్ పురాణమో, ఊక దంపుడో మిడతంభొట్లు గారి కి తెలిసి పోయేది.

''బ్రహ్మాండం బద్దలవుతూ ఉంది నాన్నా'' అన్నాడు ఆ ఉదయం. వెంటనే తను పెద్ద పట్టించు కోలేదు కాని రాను రాను ఆ మాటలు పదే పదే జ్ఞాపకం వచ్చాయి. ఆ మాటలలో ఏదో అంతరార్ధం ఉన్నట్టు ఆయన అంతర్వాణి చెప్పసాగింది. ఎంత వద్దనుకున్నా ఆ విషయం తలుచుకోలేకుండా ఉండ లేక పోతున్నారాయన. డ్రైవరు కారు తోలుతూంటే వెనక సీట్లో కూర్చుని యిలా మధన పడుతున్నారు. మనస్సు కలవర పడ్డప్పుడల్లా శూన్యంలో లోకి దృష్టిని కేంద్రీకరించడం ఆయన అలవాటు. ఈ రోజూ అదే చేశారు. ముందస్తుగా కంటి ముందు ఏదో నలక లాంటి వెలుగు కనిపించింది. ఆయన కళ్ళు నులుము కున్నారు. ఆ నలక అక్కడే ఉంది. మధ్య వేలిని కంటి రెప్ప కింద ఉంచి నెమ్మదిగా గుడ్డుని నొక్కారు. ఆశ్చర్యం. ఆ నలక స్థానభ్రంశం చెందలేదు. అక్కడే ఉంది. పైపెచ్చు యింతింతై, వటుడింతై అన్నట్టు ఆ వెలుగు శంఖాకారం పొందింది. చూస్తూ ఉండగానే ఆ శంఖం అలా అలా... సాగుతూ అనంతాకాశంలోకి వెళ్ళిపోయింది. సూన్యమనే నల్లటి కొండలో వెలుగుతో దొలిచిన గుహలా ఉంది. తను మాత్రం ఆ సారంగ పుటీవలి దరినున్నాడు. నూతిలోనుండి వచ్చినట్టు సారంగపుటద్దరి నుండి అవ్యక్తమైన శబ్దం ఒకటి వినిపించసాగింది. ఒక్కసారిగా తలలో పోటు వచ్చినట్లయింది. శరీరంలోని శక్తినంతనీ కూడ గట్టుకుని ఆ శబ్దంవేపే కేంద్రీకరించారు మిడతంభొట్లు గారు. గళబిళ ధ్వనిగా మొదలయిన శబ్దం క్రమేపీ విశదం కావచ్చింది. ''మీ భవిష్యత్తు... మీ సూర్య్య.... నవ నవ...'' మాటలు అక్కడ అక్కడ అర్ధం కాలేదు. తమాషా ఏమిటంటే ఏదో ఆకాశం లోంచి వచ్చిన అశరీర వాణి పలుకుల్లా లేవని, తన అంతరాణి తనని దేనిగురించో హెచ్చం స్తోందనిపించింది. ఇంకా కేంద్రీ కరించాలి....

``బాబుగారూ, ఆఫీసుకి వచ్చేశాం'' అన్న డ్రైవరు మాటలు మిడతంభొట్లుగారి ఆలోచనలకి అంతరాయం కలిగించి అనంతపుటవధుల నుండి ఈ లోకానికి తీసుకు వచ్చాయి.

ఆఫీసులో అడుగు పెట్టేరన్న మాటే గానీ మిడతంభొట్లు గారి మనస్సుమాత్రం ఇంకా ఈ లోకంలోకి రాలేదు. కళ్ళెంలేని గుర్రంలా పరి పరి విధాల పరుగు తీస్తున్నాది. ఏదో కుర్రవాడి కొంటె కూతలనే పునాదులమీద తను నిర్మించిన వూహా సౌధాలని తల్చుకుంటే తనకే నవ్వు వచ్చింది. కాని నుదిటి మీద చిరుచెమట సంగతి? కాళ్ళలో నీరసం, హృద్రోగంగాని రాలేదుగదా. మరో కప్పు కాఫీ తాగి చూశారాయన. వైద్యుడికి ఫోను చేశారు. ``హృద్రోగం ఎవరికి వస్తుందో చెప్పలేను కానీ, మీకు మాత్రం రాదని హామీ ఇవ్వ గలను'' బిగ్గరగా నవ్వారు డాక్టరు. ``బక్క పలచని శరీరం, రోజా వ్యాయామం చేస్తారు. ధూమపానం చెయ్యరు. మత్తు పానీయాలు పుచ్చుకోరు. అయినా మీకు హృద్రోగం ఏమిటి. ఎందుకయినా మంచిది. ఒక సారి ఫిజికల్ చేస్తే సరి పోతుంది. సాయంకాలం ఆఫీసుకి రండి'' అని డాక్టర్ ధైర్యం చెప్పారు.

మిడతంభొట్లు గారు నెమ్మదిగా తేరుకున్నారు. పని మీదకి మనస్సు పోవడం లేదు. కొంచెం విశ్రాంతయినా దక్కుతందని కాళ్ళు రెండూ టేబిల్ మీద వేసి స్వివెల్ కుర్చీలో వెనక్కి జేరబడి కళ్ళు మూసుకుని కూర్చున్నారు. అలా ఎంత సేపు కూర్చున్నారో ఆయనకే తెలియదు. ఇంకా కళ్ళు మూసుకునే ఉన్నారాయన. కంటికి ఎదురుగుండా చీకటిగా ఉన్న దృక్ క్షేత్రంలో ఏవేవో వింతవింత చుక్కలూ, బుడగలు వంటి ఆకారాలు కనిపిస్తు న్నాయి. ఆ ఆకారాలలో చిన్న నేతి దీపంలాంటి వెలుగు కనిపించింది. మళ్ళా అదే శంఖాకారం.... సారంగం...అనంతం..ఆ అనంత పుటావలి అంచునుండి మళ్ళా అదే శబ్దం... పోతే, ప్రశాంతంగా ఉన్న వాతావరణంలో ఆ శబ్దం స్పష్టంగా వినిపిస్తున్న దీమాటు

``మీ ప్రపంచం బ్రహ్మాండమైన ప్రమాదానికి లోనౌతున్నది. మీ దూరదృష్టి, మీ చాకచక్యాల మీదనే మీ మనుగడ ఆధారపడి ఉంది'' అన్న మాటలు మిడతంభొట్లు గారిని ఆశ్చర్య చకితుణ్ణి చేసాయి. తానెవరితో మాట్లాడుతున్నట్టు?

ఈ ప్రపంచానికి వచ్చిన ఆపద ఏమిటి? నిలకడ లేని మనస్సు తనతో చెలగాటాలాడుతున్నదా? పొరపాటున ఎల్.ఎస్.డి వంటి రసాయనిక పదార్థాలనేమీ తను తిన లేదు కదా? తను నిజంగా ఎవరి తోనైనా మాట్లాడుతున్నాడా? లేక తనలో తనే మాట్లాడుకుంటున్నాడా? ఈ ప్రశ్నలకి సమాధానాలు కావాలి? ``ఎవరు మీరు ? ఎక్కడ నుండి మాట్లాడు తున్నారు? నాతో ఎలా మాట్లాడగలుగుతున్నారు? అని ఆతృతగా అడిగేరు మిడతంభొట్లు.

``మేము మీ లోకం వాళ్ళం కానే కాము. మీ సూర్యమండలానికి దరిదాపు పదకొండు

కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నాము మేము. మా ఆకాశంలో ఉండే జంట సూర్యుల కంటే మీ సూర్యుడు దరిదాపు యిరవై రెట్లు కాంతివంతంగా ఉన్నాడు. కొద్ది సేపటిలో ఈ కాంతి నూరింతలు పెరిగి పోతుంది . మీ లోకాలన్నీ భస్మమై పోతాయి. మీ సంస్కృతి ని రక్షించుకోవాలంటే మీరు మరొక చోటి కి వలస వెళ్ళి పోవాలి''

టెలిఫోను లోని మాటలలా స్పష్టంగా వినిపించిన ఆ శబ్దం మిడతంభొట్లు గారి మేధకి అగ్నిపరీక్ష అయి కూర్చుంది. నివృత్తి కాని అనుమానాలు ఆయన మనోసాగరంలో ఉవ్వెత్తున లేస్తున్నాయి. భూలోకం అంతా భస్మం అయిపోతుందా? యుగాంతరం సమీపించిందా? ఈ విషయం తను దండోరా వేస్తే ప్రజలంతా గాభరా పడిపోరూ? దొమ్మి చేస్తారా? సజావు గా ఆలోచిస్తారా? ఆసన్నమవుతూఉన్న ఈ బృహత్ ప్రమాదాన్ని ఎదుర్కో డానికి ప్రపంచంలోని దేశాలన్నీ కక్షలూ, కావేషాలూ కప్పెట్టుకుని ససోదర భావం చూపుతారేమో? ఈ సందర్భంలో అయినా ప్రపంచానికి శాంతి లభిస్తే అంతే చాలు. అసలు తన వంటి హోదాలో ఉన్న మనిషి ప్రభుత్వానికి ఈ విషయం తెలియ చెయ్యాలా/? ఎలా? పత్రికల వాళ్ళ దగ్గిరనుంచి తుంటరి వెధవల వరకూ సవాలక్ష ప్రశ్నలు వేస్తారు వీటన్నిటికీ కాకపోయినా, కొన్నిటికయినా సమాధానాలు తను తయారుగా ఉంచుకోవాలి. మిడతంభొట్లు గారి మస్తిష్కం మిషనులా పని చెయ్యడం మొదలు పెట్టింది. ఆగంతకమైన శబ్దాన్నుద్దే శించి ప్రశ్నల వర్షం కురిపించేరు.

''మీరు మాకు పదకొండు కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నట్లయితే , నేను మీతో టెలిఫోను లోమాట్లాడిట్లు మాట్లాడడం అసంభవం. మీ వార్త మాకు చేరే సరికి పదకొండు సంవత్సరాలు. మా సమాధానం మీకు చేరే సరికి మరొక పదకొండు సంవత్సరాలు.... ఈ లెక్కని సంభాషణ కుదరదు. అంతే కాకుండా ఇరవై రెండు సంవత్సరాల క్రితం మా సూర్యుడి పరిస్థితి గమనించి, ఇంక కొద్ది రోజుల్లో జరగ బోయే విషయాన్ని....

''రాతియుగం, రాతియుగం, మా పూర్వీకులు ఇలాంటి కుతర్కంతో శతాబ్దాల పాటు కొట్టు కున్నారు. మా వాళ్ళుకాంతి వేగంతో సమమైన వేగంతో వాకేతాలు పంపడడం అసాధ్యమన్నారు. ఈ విశాల విశ్వంలో ఉన్న కోట్ల కొద్దీ ప్రపంచాలు, ఒకరి సంపర్కమింకొకరికి లేకుండా, ఒంటి పిల్లి రాకాసులా ఉండాల్సిందే అన్నారు. అంతర్ ప్రపంచ సంభాషణలు అసంభవం అన్నారు. కాంతి వేగం అనే అవధి చేత నిర్మించ బడ్డ ఖైదులో బందీలమన్నారు. ఇలా శతాబ్దాలు గడిచేయి. వాకేతాల వేగం కాంతివేగంతో సమమవడం అసంభవం కావచ్చుకాని, ఆ వేగాన్ని మించిన వేగంతో వాకేతాలు పంపగలమా అన్న ఆలోచన వచ్చిసరికి చాలా కాలం పట్టింది....

''మీ రనేది వార్తా ప్రసారం కాంతి వేగాన్నధి గమించి చెయ్యడం సుసాధ్యమేనంటారు.

కాంతి వేగంతో సమానం కాకుండా ఉన్నంత సేపూ చిక్కేదీ లేదంటారు. అంతేనా?

''అవును'' ఆకాశవాణి పలికింది.'' ఈ మహా విశ్వంలో అవధిలేని మహా వేగంతో ప్రయాణం చేసేది ఏది? భౌతిక శాస్త్రవేత్త గా కాకుండా సామాన్యుడిగా ఆలోచించి చూడు. ''

''మనస్సు'' మహాభారతంలో యక్ష ప్రశ్నలకు సమాధానం చెబుతూఉన్న యుధిష్టరుడిలా అన్నారు మిడతంభొట్లు గారు. ఏదో జ్ఞానోదయ మయినట్లయింది''. భౌతిక శక్తుల కసాధ్యమనిపించే క్రియలెన్నో మనోశక్తితో సాధించవచ్చునని మన వేదాలు ఎంత ఘోషిస్తున్నాయో. అంతర్గతంగా ఉన్న ఈ శక్తి ని కూడదీసి కేవలం ఇఛ్ఛామాత్రం గత మన శరీరంలో వుత్పరి వర్తనాలు కూడ సాధించ వచ్చునని ఈ మధ్య సనాతనులు వాదిస్తున్నారు కూడ. ఇవన్నీ పటిష్టం లేని సిద్ధాంతాలయితే ఈ మనో శక్తి లేక `టెలిపతి` మీద రష్యన్ శాస్త్రజ్ఞులు విరివిగా పరిశోధనలెందుకు చేస్తారు'' అనుకున్నారు మిడతంభొట్లు గారు స్వగతంగా. ఎవర్నీ ఉద్దేశించి అననే లేదు.

అవును మనో శక్తి కి మించిన శక్తి లేదు. ఈ శక్తి నుపయోగించి వ్యాధిగ్రస్తులకి సస్వత చేకూర్చ వచ్చు. వాకేతాలని ప్రసారం చెయ్యవచ్చు. భవిష్యత్కాలం లోకి చూడ వచ్చు. అన్నిటి కంటే ముఖ్యం. ఈ శక్తి తో వార్తలని ప్రసారం చెయ్యాలంటే భాషతో ప్రమేయం లేదు. నిజానికి మీ భాష ఏమిటో కూడ మాకు తెలియదు. అవసరం లేదు కూడ. మేము ప్రసారం చెయ్య వలసిన వార్త పై మా సర్వేంద్రియాలూ కేంద్రీకరిస్తాం. మా `ఏటెనా` ల ద్వారా ఈ వార్త ప్రసారంచేస్తాం''.

''మీ వాకేతాలు గమ్యస్తానం చేరిన తర్వాత వాటిని డీకోడ్ చేసి వార్తలని పైకెలా లాగడం?

`ఇది చాలా మంచి ప్రశ్న. ఈ విషయం పై ఇంకా పరిశోధనలు చేసున్నాం. ప్రస్తుతం మా శక్తి లో సగం ప్రసారం చెయ్యడానికి, రెండవ సగం గమ్యస్తానంలో డీకోడ్ చెయ్యడానికి వాడుతున్నాం. ఉదాహరణకి, ప్రస్తుతం మా శక్తి మస్తిష్కం మీద కేంద్రీకరింపబడి ఉంది. ఈ సంబర్భంలో మీ ఆలోచనలు మా మెదడు లో ఎటువంటి విద్యుత్ - రసాయనిక శక్తులని ప్రేరేపించాయో వాటికి సారూప్యమైన విద్యుత్ -రసాయనిక శక్తులు మీ మెదడులోని చక్షుశ్రవణ కేంద్రాలలో చెల రేగుతాయి. ఇప్పుడు ఏకాగ్రత నుపయోగించ గలిగిన వారిలో ఈ భావాలన్నీ ఒక త్రాటి మీదకి వచ్చి వాటి భావం వ్యక్తం అవుతుంది. అప్పుడేమా వాకేతం మీకు అర్ధం అవవుతుంది. ఈ రకం నిగ్రహాది శక్తులు లేని వాళ్ళకి మా ప్రేరేపణ

అర్థరహితంగా ఉంటుంది. ఉండడమే కాదు, రోగ గ్రస్తులవలె కొన్ని బాహ్య లక్షణాలని ప్రదర్శించడం కూడా కద్దు. ఈ విషయంలో ఇంకా పరిశోధనలు... మా శక్తి తగ్గి పోయి... మీ జాగ్రత్తలో ను....'' విశ్వాంత రాళం లోంచి వచ్చిన శబ్దం కర్పూరం నిడుకున్న హారతిలా హరించి పోయింది.

మిడతంభొట్లు క్షణమాత్రపుకాలం నిశ్చేష్టులయి ఉండిపోయారు. దివినుండి భువికి వచ్చిన వార్త యొక్కసారం ఆయన మెదడులోని కణసారానికి ఇంకా యింక లేదు. పుట్టపర్తి సాయిబాబాగారి శక్తి ఎటువంటిదో ఇప్పుడు ఆయనకి కొద్దిగా అర్థం అయ్యింది. ఇటువంటి పద్ధతి ఏదో ఒకటి లేకుండా ఆయన ఇంగ్లీషు వాడికి ఇంగ్లీషులోనూ, తెలుగువాడికి తెలుగులోనూ ఆయన ఎలా సమాధానం చెప్ప గలిగేరు? ఆయనని సంబోధించి ప్రశ్న అడక్కుండానే రాబోయేప్రశ్నకి సమాధానం చెప్పారు ఒకసారి. తపోశక్తి అంటే ఇదే నేమో?

తపోశక్తి శరీరంలో వుత్పరి వర్తనాలు కలిగించి ఉండకపోతే, కారు నలుపుగా ఉండే బాల యోగి పదహారో వన్నె బంగారపు ఛాయ లోకి ఎలా వచ్చేడు? పాస్చాత్యులు మనల్ని తప్పు దారి తొక్కించారా? మన మహర్షులు ఉత్త శుంఠలు కాదేమో?

వింత పాత బడే టప్పటికి పాత రోత పుట్టలేదు కానీ మిడతంభొట్లు గారి అంతరంతరాలలో ఉన్న శాస్త్రవేత్తకి రోషం మాత్రం వచ్చింది. ఆయన ఆ మధ్య ప్రమరించిన సిద్ధాంతాలకీ .

నేటి అనుభవానికీ అవినాభావ సంబంధం వున్నట్టనిపించింది. మొట్టమొదటిసారిగా తన సిద్ధాంతాలని ప్రయోగాత్మకంగా నిరూపించడానికి వచ్చిన అవకాశమా ఇది ? సనాతనమయిన ఖగోళ భౌతిక శాస్త్రపు సిద్ధాంతాల దృష్ట్యా మన సూర్యుడు పేలి పోడానికి అవకాశాలు తక్కువ. కాని తను ఉద్ఘాటించిన సిద్ధాంతంలో వెలుగు వేగానికి అవధులు తీసేస్తే కొన్ని సమీకరణాల ప్రవర్త నలో ఏకత్వం గోచరిస్తున్నది. అదే నిజమైతే సూర్యుడి వంటి తారలెన్నో నోవాలుగా మారిపోయి పేలి పోయే అవకాశాలున్నాయి. కాని తన సిద్ధాంతం సంభావ్యతని తెలుపుతుంది కాని నిర్దిష్టంగా ఏమీ చెప్పదు. సూర్యుడు నోవాగా మారి పోతే సౌర కుటుంబం అంతా భస్మం అయి పోవచ్చు. లేదా అంతర్ గ్రహాలు కొన్ని బలి కావచ్చు. పౌర ధర్మం ప్రకారం ఈ విషయం ప్రధాన మంత్రికి తెలియజెయ్యాలా? తెలియ జేస్తే జరిగేదేముంది? ఇప్పుడు తను ఏం చేసినా గత జల సేతు బంధనమేనా? అలాగని రిక్తహస్తుడై వూరుకోలేడు కదా? తనకి చేతనయినది చెయ్యాలి. గబ గబ కంప్యూటరు సెంటరు కి పరిగెట్టారు మిడతంభొట్లు. సాయంకాలం వరకూ ఆయన క్రమణాలు వ్రాసి, కంప్యూటరుని నడప వలసిన విధానం అక్కడి సిబ్బందికి బోధించి ఆయన ఇంటి మొహం పట్టారు. కంప్యూటరు ఏమిటి

చెప్తుందో చూద్దామని అయన ఆశ. దారిలో ఊనుకున్న ప్రకారం శర్మ గారి క్లినిక్ దగ్గిర ఆగారు మిడతంభొట్లు. శర్మ వైద్యుడే కాకుండా కుటుంబ స్నేహితుడు. ఇద్దరూ రాజకీయాల దగ్గరనుంచి అన్ని విషయాలూ చర్చిస్తారు. తన ఆరోగ్యాని కేమీ ఢోకా లేదన్న ధీమాతో, ఏదో బాతాఖానీ వేద్దామన్న ఉద్దేశంతో లోపల అడుగు పెట్టేరు. జరిగిన సంగతులన్నీ పూస గుచ్చినట్టు చెబుతూ ఉంటే శ్రద్ధగా విన్నారు శర్మ గారు. ఆయన ముఖ కళవళికలని బట్టి డాక్టరుగారి మనోభావాలని ఆకళింపు చేసుకుందామనుకున్న మిడతంభొట్లు గారికి నిరాశే మిగిలింది. శర్మగారి మొహ్హం గంభిరంగా ఉంది.

"పైత్యం చేసిన వాడికి భూమి గిర్రున తిరుగుతున్నట్లు అనిపిస్తుంది దానిని ప్రయోగాత్మక మైన ఆధారంగా భావించి

భూమి తిరుగుతున్నాదీ అంటే మీరు ఒప్పుకుంటారా? అలాగని భూమి తిరగలేదని అనగలమా? కారణ కార్య సంబంధం తార్కికంగా నిరూపించాలికదా! మీ వాడేదో బ్రహ్మాండం బద్దలవుతున్నాది" అన్నాడని ఆ విషయమే పదే పదే ఆలోచించి, చిలవలు, పలవలతో పగటి కలలు కన్నారేమో?"

'నా క్షోభ అంతా మానసికమయినదని మీరు తేలకగా తీసిపారేస్తారనుకోలేదు" మిడతంభొట్లు చిన్నబుచ్చుకున్నారు.

"మానసికం కావచ్చు. శారీరకం కావచ్చు. మంత్రతం కావచ్చు. మీ వెనక వీధిలో ఉన్న సాయెబు చెడుపు చిల్లంగీ అంటారే అలాటి కనికట్టు విద్య ఏదైనా మీ మీద ప్రయోగిస్తున్నాడేమో. అసలు మీరు మీ పెరటి వీధిలోని పుల్లయ్య తో మాట్లాడ లేదనీ, మీరు కన్నదీ, విన్నదీ విశ్వాంతర తళపు లోతులలోంచి వచ్చినదని ఋజువేది?"

"వాళ్ళు పదకొండు కాంతి సంవత్సరాల దూరం నుంచి గోల పెడుతున్నామని అఘోరిస్తు న్నారు కదా"

"నేనే, శ్రీకృష్ణ పరమాత్మని వైకుంఠం నుంచి మాట్లాడుతున్నాని టెలిఫోనులో పిలిచి నేనే మీతో చెబితే మీరు నమ్మేస్తారా? నిలదీసి అడిగేరు శర్మ గారు. మిడతంభొట్లు గారికి పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయింది. అహం దెబ్బ తింది. అయినా తమాయించుకుని వింటున్నారు.

"చూడండి. పైత్యం చేసి ఉండవచ్చు. ఎలర్జీ అయి ఉండవచ్చు. ఏ వైరస్ లాటిదో మీ

మెదడు లో దూరి హంగామా చేసి ఉండ వచ్చు . ఇంకా ఏదైనా వుండవచ్చు. పరీక్ష చేసి చూస్తేసరిపోతుందిగా''

''కాలు బెణికితే రుమాటిక్ హార్ట్ డిసీజ్ లా వుందీ, ఓపెన్ హార్ట్ సర్జరీ చెయ్యాలన్నాడుట మీ లాంటి వైద్యుడే'' బాకీ తీర్చేసుకున్నారు మిడతంభొట్లు.

''చూడండి, మన సూర్యుడు పదకొండేళ్ళ కొకసారి వింతగా ప్రవర్తిస్తూంటాడని మీరు చెప్పిన విషయమే. ఈ సమయంలో సూర్యుడి నుంచి అనేకమైన పరమాణు కిరణాలు భూగ్రహాన్ని ఢీకొంటాయని మీరే కదా నాకు చెప్పేరు. ఈ ఏకాదశ వర్ష చక్రంలోకి సూర్యుడు ఇప్పుడే ప్రవేశిస్తున్నాడు కదా. ఈ సందర్భంలో ఒక కాస్మిక్ కిరణం మీ మెదడులో దూరి....''

''కాశ్మిక్ కిరణాలు ఇంత హడావుడి చేస్తాయా? ''మొదటి సారిగా మిడతంభొట్లు గారి కంఠంలో ఆతృత గోచరించింది.

ఈ ప్రశ్నకి సమాధానంగా డాక్టరు అగ్గిపుల్ల గీశారు. దాని అంతరార్థం ఏమిటా అని విస్తు పోయి చూస్తున్నారు'' ఈ వెలుగు మీ కంటి రెటీనా మీద పడుతుంది. రెటీనా ఈ వెలుగు విద్యుత్ వాకేతంగా మార్చి నేత్రనాడి ద్వారా మెదడు లోని కపాలాస్తిక తమ్మి అనే భాగానికి పంపుతుంది. ఈ విద్యుత్ వాకేతం అక్కడ కొన్ని రసాయనిక క్రియలని ప్రేరేపించి మీరు ఈ వెలుగుని చూస్తూ వున్న భ్రమని కలిగిస్తుంది. ఇప్పుడు మీరు కళ్ళు మూసుకుని ఉన్నారనుకోండి. ఏదో ఒక విధంగా యిందాకటి రసాయనిక క్రియని నేను మీ మెదడులో ప్రేరేపించేననుకోండి. ఇప్పుడు కూడ మీరు దీపాన్ని చూస్తున్నట్లు భ్రాంతి కలిగిస్తుంది మీ మెదడు. ఒప్పు కుంటారా?''

తార్కికంగా ఉన్న డాక్టరు గారిని ఖండంచ లేకపోయారుమిడతంభొట్లు'' ఏ కాస్మిక్ కిరణమో, వైరస్ వంటిదో నా మెదడు లో చేరి అక్కడ రసాయన క్రియలని ప్రేరేపించి నాకీ 'హాలుసినేషన్' కలిగిస్తున్న దంటారు. ''

''మీ రలా అధైర్య పడకండి. మీరు వుదయం నుంచి విన్నవీ, కన్నవీ ఏ కారణం వల్లనన్నా సంభవించ వచ్చని చెబుతున్నానంతే. ముందు సేంద్రీయ లోపం ఏమీ లేదని తెల్చుకోవాలి కదా''.

''సేంద్రీయ లోపం ఏదీ లేదని తేలితే అప్పుడు నేను మరొక ప్రపంచంలోని ప్రాణులతో మాట్లాడినట్లు ఒప్పు కుంటారా?

''అలాగని నేను అన లేదే. సేంద్రీయ లోపం లేక పోతే, మానసిక లోపం ఉందేమో చూడాలి. అదీ లేక పోతే మీ ఇంటి వెనక సాయిబు ఏం చేస్తున్నాడో చూడాలి. ఆ తర్వాత సంగతి తరవాత చూద్దాం.''

మిడతంభొట్లు గారు నీరు కారి పోయారు. డాక్టరు మాత్రం మర్నాడు మిడతంభొట్లు గారి మీద చెయ్యవలసిన పరీక్షల జాబితా ఒకటి నర్సుకి చెబుతున్నారు. ఆయన ధోరణిని బట్టి మిడతంభొట్లు గారి గుండె అంటే రాయిలా ఉంది కానీ మరొకటేదో అవుగ్గా ఉన్నట్టు తేలి పోయింది. గుండె రాయి చేసుకుని ఇల్లు చేరుకున్నారు మిడతంభొట్లు గారు. ఎనిమిదయే సరికల్లా మిడతంభొట్లు క్లినిక్ లో కాలు పెట్టారు. సూదులు, గొట్టాలు పట్టుకుని నర్సులు చుట్టూ మూగేరు. రక్తపుపోటు, నాడి, హృదయ స్పందన, ఇ.కె.జి వగైరా గుండెకి ఢోకా లేదని తేల్చి వేశాయి. 'గ్లూకోజు టోలరెన్సు' పరీక్ష లో కూడా నెగ్గేసేరు. బుర్రకి తీగలు తగిలించి ఇ.ఇ.జి. తీశారు. మెదడులోని విద్యుత్ రసాయనిక క్రియలన్నీ సవ్యంగానే జరుగుతున్నాయని తేలి పోయింది. కంటి డాక్టరు వచ్చి రెండు కళ్ళనీ పరీక్ష చేసారు. నూటికి నూరు మార్కులు ఇవ్వలేనన్నారు. అంటే కుడి మెదడులలో లోపం అండి ఉండ వచ్చున్నారు.

మెదడులో ఈ చెవి నుండి ఆ చెవి వరకూ కిరీటం వంటి ఒక భాగం ఉంది. ఈ భాగాన్ని చలనపు చార అంటారు. ఈ 'చార' వెంబడే కదలికకి సంబంధించిన కేంద్రాలన్నీ వున్నాయి. శరీరంలోని చలనాలన్ని యీ భాగంయొక్క పర్యవేక్షణలోనే జరుగుతాయి. ఈ చలనపు చార నానుకుని మెదడు వెనక భాగంలో యిరుపక్కలా శ్రవణ కేంద్రాలున్నాయి. ఈ శ్రవణ కేంద్రాలు రెండిటినీ ఆనుకుని మెదడు వెనక భాగంలో దృష్టి కేంద్రం ఉంది. వాక్ కేంద్రం ఎడమ మెదడు మాత్రమే ఉంది. మిడతంభొట్లు గారి మాటలో ఎక్కడా లోపం లేదు కనక కుడి మెదడు పైకేంద్రీకరించారు అంతా. కానీ కుడి మెదడులో ఎక్కడ?

న్యూరో సర్జన్ కళ్ళు మరో సారి పరీక్ష చెయ్యాలన్నారు. కళ్ళలోని కండరాలు బలంగానే ఉన్నాయి. వాటి ప్రవర్తితలు బావున్నాయి. మెదడుకి రక్తాన్ని తీసుకు వెళ్ళే గళ ధమనులలో ప్రవాహం బలంగానే ఉంది. డాక్టర్లంతా ఎక్కడ బటల్దేరారో అక్కడికే వచ్చారు. ఇక మెదడు మారుమూలలన్నీ కంచు కాగడా పెట్టి వెతకాలి. కపాలస్తిక తమ్మి మారుమూలల్లో దాగి ఉంది. దానిని చూడడానికి చిన్న బ్రహ్మ ప్రయత్నం చెయ్యాలి.

నర్స్ వచ్చి టెక్నీషియం సెర్ సెక్నేట్  ఒక సిరలోకి ఇంజక్షన్ ఇచ్చింది. ఆ మందు రక్త ప్రవాహంతో బాటు  మెదడులోకి వెళ్ళగానే ఒక రకం కెమేరాతో బుర్రకి వివిధ కోణాలనుండి ఫొటోలు తీశారు. తర్వాత ఏంజియో గ్రామ్ తీసేరు. ఈ రెండు ఫొటోలలోనూ కఫలాస్తిక తమ్మి  దగ్గర చక్షు శ్రవణ కేంద్రం  కొద్దిగా వాచినట్టు అని పించింది. అక్కడే ఏదో దోషం వుంది. అది ఎంత హాని చేస్తుందో వైద్యులెవ్వరూ చెప్పలేకపోయారు. శస్త్రచికిత్స అవసరమా కాదా అన్న మీమాంసలో పడ్డారు వైద్యులంతా. శస్త్రచికిత్స చేస్తే లాభాలెన్ని ఉన్నాయో నష్టాలు అన్నే ఉన్నాయి. మెదడులో దాదాపు అంగుళం లోతు గొయ్యి తవ్వాలి. తవ్వి, వైద్యుడు గోతి గుండా వేలిని పోనిచ్చి, ఆ తమ్మిని పరీక్షించి చూడాలి. ఈ గొయ్యి వెళ్ళే మార్గంలోనే దృష్టికి సంబంధించిన కేంద్రం వుంది. కనుక శస్త్రచికిత్స వల్ల కొత దృష్టా శాస్వతంగా పోతుంది. ఇంకా ఏమైనా జరగవచ్చు. నిజంగా మానవుడి మస్తిష్కం యొక్క కట్టడి యింకా ఎవరికీ అర్థం కాలేదు. కాని ఈ శస్త్రచికిత్స చెయ్యకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే హాని సంభవించ వచ్చు. ఈ విషయాలన్నీ మిడతంభొట్లు గారి వైద్యులు కూలంకషంగా చర్చించేరు. ఆఖరి నిర్ణయం మిడతంభొట్లు గారి భుజస్కంధాల మీద వదిలేశారు.

ఇది ఏకాంతంగా చెయ్యవలసిన నిర్ణయం కాదు. సంసారంలో అందరితోటీ సంప్రదించేరు. ఆపరేషన్ వల్లకాదన్నారు నాన్నగారు. 'విరేట్రంఆల్బం 30 '' అరగంటకొకటి చొప్పున వెయ్యడం మొదలు పెట్టారాయన.  ఎందుకైనా మంచిదని కుర్రాడి జాతకం చూడడం మొదలు పెట్టేరు. మామ్మ అవధానికి కబురంపింది. అరగంటలో అవధాని ఆంజనెయ దండకం, గాయత్రీ జపం వగయిరాలన్నీ  చేస్తున్నాడు. సాయబు కాదు కదా ఆ సాయబు తాత కూడా తన మనమణ్ణే మీ చెయ్యలేడని సవాలు చేసింది మామ్మ. నాన్నగారు జాతకాన్ని ఎలాగైనా మరమ్మత్తు చెయ్యడానికి వీలుంటుందేమో అని  చూస్తున్నారు. వాకిట్లో మంచం మీద పడుకుని ఉన్నారు మిడతంభొట్లు. పక్కనే రాధ కూర్చుని వుంది. ఆకాశంలో నక్షత్రాలు మిణుకు మిణుకు మంటున్నాయి. అర్థ రాత్రి దాటిపోయింది.

''ఏ మైనా గుణం కనిపించిందా నాన్నా' అంటూ నాన్న గారు హోమియో పతీ మందు సీసా పట్టుకుని వాకిట్లోకి వచ్చారు. మిడతంభొట్లు గారు ఒక్కసారి త్రుళ్ళి పడి మంచం మీద నుండి క్రిందకి గెంతారు.  వాకలంతా ఒక్కసారి పట్ట పగలులా అయిపోయింది. ఆకాశంలో కంటికి కనిపించీ కనిపించనంత నక్షత్రం ఒకటి  చూస్తుండగా నూరింతల కాంతితో ప్రకాశించ సాగింది. ఏసుక్రీస్తు జన్మించబోయే ముందు నాజరత్‌లో కనిపించిన తారలా మిల మిలా మెరిసి పోయిందా నక్షత్రం. ''అప్పుడే తెల్లారగట్రయి పోయిందట్రా'' అంటూ మామ్మ కూడ వాకిట్లోకి వచ్చింది.

``అవతార పురుషుడు ఎవరో పుడుతున్నాడురా'' అన్నారు నాన్నగారు. ``అదే నోవా నాన్నగారూ ''' అన్నారు మిడతంభొట్లు.

``రాంగ్ నెంబర్, నాన్న గారూ! రాంగ్ నంబర్''' అన్న మిడతంభొట్లు గారి మాటల్లోని భావం ఎవరికీ అర్థం కాలేదు.